ఈనాడు
నాగర్‌కర్నూల్
శనివారం అక్టోబరు 12, 2024

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి దంపతులు గౌరీ మాతకు పూజలు చేసి బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా దసరా పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రామ రామ రామ ఉయ్యాలో



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కొండారెడ్డిపల్లికి కొత్త సొబగులు

- సీఎం హోదాలో తొలిసారిగా రేవంత్ స్వగ్రామానికి రాక!
- గ్రామస్థులతో దసరా వేడుకలు, అభివృద్ధి పనుల ప్రారంభం

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, వంగూరు: ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి మొదటిసారిగా నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని స్వగ్రామం కొండారెడ్డిపల్లికి శనివారం వస్తున్నారు. ఏటా దసరా పండగను ఆయన స్వగ్రామంలో చేసుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పటివరకు కొండారెడ్డిపల్లికి రాలేదు. దసరాకు సీఎం వస్తుండటంతో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఇతర ఉన్నతాధికారులంతా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్థులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించనున్నారు.


సీఎం ప్రారంభించనున్న అమర జవాను యాదయ్య స్మారక గ్రంథాలయ భవనం



ప్రతి ఇంటికి సౌర కాంతులు.. : కొండారెడ్డిపల్లిలో ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా 'పీఎం సూర్య ఘర్ యోజన' కింద ఎంపిక చేశారు. గ్రామంలో గృహ విద్యుత్తు కనెక్షన్లు 499, వ్యవసాయ పంపుసెట్ల కనెక్షన్లు 867, వాణిజ్య కనెక్షన్లు 66, పారిశ్రామిక కనెక్షన్లు 10, విద్యుత్తు దీపాల కనెక్షన్లు 7, విద్యా భవనాల కనెక్షన్లు 2 ఉన్నాయి. వీటన్నింటికి సౌర ఫలకాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు 25 ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటు చేయగా వాటిని దసరా రోజు ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మిగతా ఇళ్లకు కూడా త్వరలోనే సౌర ఫలకాలు ఏర్పాటు చేయనున్నారు.

కార్యక్రమాలు ఇలా.. : గ్రామంలో రూ.72 లక్షలతో కొత్త పంచాయతీ భవనం, రూ.55 లక్షలతో అమర జవాను యాదయ్య స్మారక గ్రంథాలయాన్ని, రూ.45లక్షలతో బీసీ సామాజిక భవనాన్ని, రూ.45లక్షలతో పశు వైద్యశాల భవనాన్ని నిర్మించారు. ఆయా అభివృద్ధి పనుల శిలా ఫలకాలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. వాటిని ఆవిష్కరించి ఆయా భవనాలను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి తాను సెంటిమెంట్‌గా భావించే స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో, అలాగే జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం ఎండ్లబండిలో జమ్మిచెట్టు వద్దకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లావాసుల ఆశలు.. : సీఎం స్వగ్రామానికి వస్తున్న నేపథ్యంలో వరాలు కురిపిస్తారని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. సీఎం తాను నల్లమల బిడ్డనని పదే పదే చెబుతుంటారు. నల్లమలలో ఆదివాసీలకు పోడుభూముల పట్టాలు ఇస్తామని గతంలో ప్రకటించారు. పోడు భూములపై హక్కుల కోసం ఉమ్మడి జిల్లాలో 18,190, నాగర్‌కర్నూల్ జిల్లాలో 11,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కేఎల్ఐ అదనపు ఆయకట్టు పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల కల్వకుర్తిలో నిర్వహించిన జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ఆ నియోజకవర్గానికి పెద్దఎత్తున హామీలు ఇచ్చారు. కొండారెడ్డిపల్లి పర్యటన నేపథ్యంలో ఆయా అంశాలపై సీఎం దృష్టిసారించే అవకాశముందని, కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు ప్రత్యేకంగా నిధుల ప్రకటన ఉండొచ్చని స్థానికులు ఆశిస్తున్నారు.

సిద్ధిధాత్రీ దేవిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జోగులాంబ సిద్ధిధాత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం శమీ పూజ, నదీ హారతి అనంతరం రాత్రి 7 గంటలకు తుంగభద్ర నదిలో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. తెప్పోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులతో పుష్కర ఘాట్ కిక్కిరిసిపోతుంది. అనంతరం ధ్వజావరోహణతో ఉత్సవాలు సమాప్తం అవుతాయి.

దసరా పండగ విజయానికి ప్రతీక

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విజయదశమి విజయానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు చెప్పారు. ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల మధ్య పండును జరుపుకోవాలని సూచించారు.

ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తుల స్వీకరణ

కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే : కొల్లాపూర్ నియోజకవర్గంలోని రైతులు 2024 రబీలో సీజన్‌లో ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తులు చేసుకోవాలని ఉద్యాన - పట్టు పరిశ్రమల శాఖ కొల్లాపూర్ అధికారి లక్ష్మణ్ సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫొటోలు, బ్యాంకు ఖాతా నంబర్ జిరాక్స్‌లతో కొల్లాపూర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు.

విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



దమగ్నాపూర్ వద్ద సమీకృత పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర, మాజీ ఎమ్మెల్యేలు

బాలానగర్, న్యూస్‌టుడే : విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు విధానాలు రూపొందిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ పరిధి ఎర్రగుట్ట వద్ద, బాలానగర్ మండలం పెద్దాయపల్లిలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత కేసీఆర్ పాలన ఫామ్‌హౌజ్‌కు పరిమితమైందని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. ప్రారంభించిన కొన్ని గురుకులాలు కూడా ప్రైవేట్ భవనాల్లోనే ఉన్నాయన్నారు. నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకే సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో పాఠశాలలో 2వేల మంది విద్యార్థులు చదువుకోవచ్చన్నారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాలు చేపట్టి, టీచర్లను భర్తీ చేశామని తెలిపారు. రుణమాఫీ హామీని నిలబెట్టుకోవటాన్ని ఓర్వలేకనే మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. కురుమూర్తి గుట్టపై ఘాట్‌రోడ్డు, పొన్నకల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, మాజీ ఎమ్మెల్యేలు సీతాదయాకర్‌రెడ్డి, స్వర్ణ సుధాకర్, డీఈవో రవీందర్, నేతలు అరవింద్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కతలప్ప, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దత్తాత్రేయ, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, తిరుపతి, సాధు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అబద్ధాల పాలన: డీకే అరుణ



మరికల్‌లో మైనార్టీ నాయకుడి ద్వారా సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎంపీ

మరికల్, ధన్వాడ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పాలన అబద్ధాలతోనే కొనసాగుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మరికల్, ధన్వాడ మండలాల్లో పర్యటించారు. తీలేర్‌లో పార్టీ పతాకావిష్కరణ నిర్వహించిన ఎంపీ అక్కడ, మరికల్, ధన్వాడ పట్టణాల్లో సభ్యత్వ నమోదు ప్రారంభించి హాజరైన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పే అధికారంలోకి వచ్చిందని, ఆ తర్వాత సైతం ఇదే విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. గత భారాస ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో ప్రజాధనాన్ని దోచుకోగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరుతో దోపిడీకి తెరతీసిందన్నారు. ఈ డబ్బును హరియాణా, జమ్ముకాశ్మీర్ ఎన్నికలకు తరలించగా, ఇపుడు మహారాష్ట్రకు పంపడానికి ప్రణాళిక రూపొందించుకుందన్నారు. ఎమ్మెల్యేలు సొంతూళ్లను సైతం పట్టించుకోవడంలేదని, ఇందుకు ధన్వాడ ఉదాహరణ అని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కనీసం వంతెన నిర్మాణానికి నిధులు తేలేదన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపీ దుర్గాదేవి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్, ఉమేష్ కుమార్, నర్సన్‌గౌడ్, రాంచంద్రయ్య, ఉదయభాను, సురేందర్, భాస్కర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నీ శక్తే ఆయుధమైతే..

జీవితమే విజయ దశమి




మనలో అపారమైన శక్తి ఉంది.. దాన్ని జాగృతం చేస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయి. శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మ అలంకారాలు, ఆయుధాలు మనకు ఈ విషయాన్ని తెలియజేస్తాయి. సరైన జీవన విధానమే శక్తిని ప్రజ్వలింపజేస్తుంది. మన జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. .. – న్యూస్‌టుడే, కోస్గి



● సింహం అంటేనే అందరికీ భయం. అమ్మవారు దాన్ని అదుపులో పెట్టి స్వారీ చేస్తారు. దూకుడు, హింసాత్మక ధోరణులను అదుపులో ఉంచుకునే శక్తి తనలో ఉందని అమ్మవారు చూపించారు. దాన్ని మనం ఆదర్శంగా తీసుకొని మనలోని హింసాత్మక ధోరణి తగ్గించుకోవాలి.




● చుట్టూ ఎంత హీనమైన పరిస్థితులున్నా మన వ్యక్తిత్వంతో వికసించాలని కమలం పువ్వు తెలియజేస్తుంది. అందుకేనేమో అమ్మవారు కమలం పువ్వుపై కూర్చొని ఉంటారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బెట్టింగ్‌లు, మట్కా, గుట్కా, జూదం, మద్యపానం వంటి దుర్లక్షణాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. చుట్టూ ఇలాంటి పరిస్థితుల నడుమ ఎలాంటి ప్రభావానికి లోను కాని వారిని ఎందరినో చూశాం.



● శక్తి సామర్థ్యాలకు, ఏకాగ్రతకు ప్రతీక విల్లు. లక్ష్యం నెరవేరాలంటే ఏకాగ్రతతో విల్లు సంధించాలి. లక్ష్యానికి గురి తప్పకుండా తగిలేలా మన ప్రయత్నం కొనసాగాలి. జిల్లాకు చెందిన పలువురు పేదింటి పిల్లలు ప్రతికూలతలను అధిగమించి మూడు, నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారంటే ఎంతటి ఏకాగ్రత ఉన్నదో అర్థం అవుతుంది.



● త్రిశూలం అనేది సత్వ, తమో, రజో గుణాలను సూచిస్తుంది. ఈ మూడు గుణాలు నియంత్రణలో ఉంటే అద్భుత విజయాలు సమకూరుతాయి.



● చక్రం ధర్మానికి చిహ్నంగా, జీవితంలో మన విధులు పక్కాగా నిర్వర్తించాలనే విషయాన్ని బోధిస్తుంది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు అందరూ తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే వ్యక్తిగతంగానే కాకుండా సమాజ అభివృద్ధికి దోహదపడవచ్చు.



● చెడు, అజ్ఞానాన్ని నిర్మూలించేందుకు జ్ఞానం అనే ఖడ్గాన్ని ఆయుధంగా చేసుకోవాలని శక్తి స్వరూపిణి సందేశాన్ని ఇస్తుంది.



● బలం, విధేయతకు ప్రతిరూపంగా గధను తెలుపుతారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక శక్తి ఉంటుంది. దానిని మనమే గుర్తించాలి. ఆ రంగంలో ప్రావీణ్యం సంపాదిస్తే ఉన్నతంగా ఎదుగుతాం. దేహబలం, ఆర్థిక బలం ఎంత ఉన్నా, వినయ, విధేయతలు కలిగి ఉండాలి. మనం నేర్చుకున్న నైపుణ్యాలే మనకు బలంగా మారాలి.

● శంఖం సంతోషానికి చిహ్నం. సంతృప్తితోనే సంతోషం కలుగుతుంది. పక్కవారిని చూసి లేనిపోని వాటికి పరుగులు పెడితే ఆనందం ఆవిరైపోతోంది. ఉమ్మడి జిల్లాలో ఆన్‌లైన్ గేమ్స్, భూ తగాదాలు, హత్యలు అత్యాశకు పోయి తెచ్చిన అనర్థాలే.

మనం చేసే పనిలో విజయం సాధించాలని కోరుకుంటాం. అందుకు తగిన కృషి, పట్టుదల, నేర్పు, ఓర్పు, సహనం ఎంతో అవసరం. మన పండగలు ఎన్నో జీవిత పాఠాలు, విలువలు బోధిస్తాయి. దసరా పండగ సైతం ఎన్నో అంశాలను మనకు తెలియజేస్తుంది. జమ్మి వృక్షాన్ని పూజించడం, పాలపిట్టను దర్శించడం, నవరాత్రులు అమ్మవారిని ఆరాధించడం, బతుకమ్మలను కొలవడం.. వంటివి ఎన్నో సందేశాలను ఇస్తాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వెయ్యికిపైగా దుర్గమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి నిత్యపూజలు చేశారు..

సందేశాత్మక ఆచారాలు




అంతర్గత శత్రువును జయించవచ్చు: దుర్గామాత శత్రు సంహారాన్ని చేయడం బాహ్యంగా చెప్పుకుంటున్నా, అంతర్గతంగా మనలో ఉండే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములు అనే శత్రువులను ఓడించాలనే సందేశం ఈ పండగ ఇస్తుంది. వీటిని గెలిచినప్పుడే మనం సంపూర్ణ వ్యక్తులుగా నిలుస్తాం. అమ్మవారిని కొలవడం మూలంగా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతి స్వరూపం అయిన శక్తి ప్రవహించి శారీరక, మానసిక రుగ్మతల నుంచి బయటపడతాం.

\- చంద్రశేఖర జోషి, పండితుడు, మహబూబ్‌నగర్



పత్రంతో ప్రమాణం: దసరా రోజు జమ్మి పత్రాలు పరస్పరం మార్చుకుంటూ స్పర్థలు విడనాడి కలిసి ఉందామని ప్రకృతి సాక్షిగా ప్రమాణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు వచ్చేవారు మనసు విప్పి మాట్లాడుకోవడానికి, తిరిగి ఒక్కటిగా కలిసి ఉండేందుకు ఈ సంబరం వేదికగా ఉంటుంది. విలువైన ఔషధ విలువలున్న జమ్మి చెట్టును కాపాడుకోవాలని బోధిస్తుంది.



భరోసా చిహ్నం ఆయుధపూజ: జీవనోపాధిలో సహాయపడే ప్రతి వస్తువును అమ్మవారి వద్ద ఉంచి పూజిస్తారు. వ్యవసాయ పరికరాలు, కర్మాగారాలు, మెకానిక్ దుకాణాలలోని మిషనరీ మొదలుకుని ఆఖరికి చిన్న పిల్లల పుస్తకాల వరకు పూజిస్తారు. వారి రంగంలో ప్రగతికి అవే కదా ఆయుధాలు. వృత్తి నైపుణ్యం ఈ ఆయుధాలతోనే సాధ్యం కాబట్టి భరోసాకు చిహ్నంగా ఆయుధపూజ చేస్తారు.



పాలపిట్ట: విజయదశమి పండగ వేళ పాలపిట్ట కనిపిస్తే ఆ ఏడాదంతా విజయాలతో కూడిన అదృష్టం వరిస్తుందని విశ్వసిస్తారు. భయం అంటే తెలియని పాలపిట్టను చూసేందుకు పల్లెటూళ్లలో పంట పొలాలకు వెళ్తారు. పక్షులు, జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, జీవ వైవిధ్య ఆవశ్యకతను తెలియజేస్తుంది.



ప్రకృతిపై ప్రేమను పెంచే ఆచారం : దసరా వేడుకలలో జమ్మి చెట్టును పూజించడం, పాలపిట్ట దర్శనం కోసం పచ్చిక బయళ్లలో తిరగడం వంటి ఆచారాలు ప్రకృతిపై ప్రేమను పెంచుతాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తుచేస్తాయి. నవరాత్రి వేడుకలలో భాగంగా బతుకమ్మ ఉత్సవాలు పచ్చటి పరిసరాల ఆవశ్యకతను, వైవిధ్యాన్ని చాటుతాయి. తొమ్మిది రోజుల పాటు చేసే దుర్గామాత ఆరాధనలో చిన్నారులను భాగస్వాములను చేస్తే చక్కని విలువలు నేర్చుకునే వీలుంది.

\- వార్ల మల్లేశం, జాతీయ హరిత దళ సమన్వయకర్త

అంబరాన్నంటిన మహా బతుకమ్మ



సంబరాల్లో గాయకులు, కళాకారులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : అచ్చంపేటలో నల్లమల మహా బతుకమ్మ సంబరాలు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు సందడి చేశారు. నల్గొండ గద్దర్ (నర్సిరెడ్డి), రేలారే రేలా గంగా, గాయకుడు బోలే షావలి కళా ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలతో నల్లమల ఖ్యాతిని చాటి చెప్పాలని నిర్ణయించామన్నారు. ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి రూ.50వేలు, రూ.25వేలు, రూ.15వేల చొప్పున నగదు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా.అనురాధ, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ గంగాపురం రాజేందర్, పుర అధ్యక్షుడు గార్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిందూ సమాజం సంఘటితంతోనే దేశం సుభిక్షం

ఆరెస్సెస్ దక్షిణ మధ్య క్షేత్ర నేత అమర లింగన్న





ప్రసంగిస్తున్న అమర లింగన్న, వేదికపై పల్లె నాగయ్య, వసంతం వెంకటేశ్వర్లు.. ప్రార్థన చేస్తున్న స్వయం సేవకులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : హిందూ సమాజం జాగృతమై, సంఘటితమైతేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, ఇదే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) అకుంఠిత దీక్షతో పనిచేస్తోందని సంస్థ దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాలు, విజయదశమి వేడుకలు నిర్వహించారు. ముఖ్యవక్తగా అమర లింగన్న మాట్లాడుతూ ఆరెస్సెస్ ఏర్పడి 100 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది సమాజంలో పరివర్తన కోసం ప్రత్యేకంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వ్యక్తిలో దేశభక్తిని నింపటం, కులవివక్ష నిర్మూలన, ఆదర్శ కుటుంబ వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ కోసం ఆరెస్సెస్ నిరంతరం పనిచేస్తుందన్నారు. విజయదశమి స్ఫూర్తితో దేశం, ధర్మ పరిరక్షణకు పాటుపడాలని, కులాలు పట్టించుకోకుండా ప్రతి హిందువు సోదరుడే అనే భావనతో జీవించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యాపారవేత్త పల్లె నాగయ్య మాట్లాడుతూ భారతీయ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఆరెస్సెస్ సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముందుగా నగరంలో చేపట్టిన పథ సంచలనం, మైదానంలో చేసిన యుద్ధ కళలు, యోగా, హోష్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆరెస్సెస్ జిల్లా సంఘ్‌చాలక్ వసంతం వెంకటేశం, నేతలు పాల్గొన్నారు.



కర్నెతాండలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

గిరిజనుల సంస్కృతి గొప్పది : చిన్నారెడ్డి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కర్నెతండాలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తుల్జాభవాని వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్నెతండా ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పూర్తి చేయాలని మాజీ ఎంపీపీ కోరగా త్వరలోనే పూర్తి చేయించి ముఖ్యమంత్రితో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చి అమ్మవారి సమక్షంలో ఉంచారు. గిరిజనుల బతుకమ్మ ఆటపాటలు అలరించాయి. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు బెల్యానాయక్, రామ్‌బాల్‌నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వివాహమైన నెల నుంచే వేధింపులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణం



సుప్రియారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: వివాహమైన 8 నెలలకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు, బాధిత మహిళ తండ్రి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం, నందిపేటకు చెందిన సుప్రియారెడ్డి(26)ను అదే జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మిపల్లికి చెందిన మద్దూరు రాఘవేందర్‌రెడ్డికి ఇచ్చి మార్చి 24న వివాహం చేశారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కేపీహెచ్‌బీ ఠాణా పరిధి శంషీగూడలో ఉంటున్నారు. వివాహమైన నెల నుంచే రాఘవేందర్‌రెడ్డిని భార్యని వేధించసాగాడు. తాను చెప్పినట్టే వినాలని, ఆమె జీతం తన బ్యాంకు ఖాతాలోనే జమచేయాలని, ఇల్లు కట్టుకునేందుకు పుట్టింటి నుంచి 3 ఎకరాలు రాయించుకురావాలని సుప్రియను రాఘవేందర్‌రెడ్డి ఒత్తిడి చేయసాగాడు. ఇలా గొడవల్లో సాగుతోన్న రాఘవేందర్‌రెడ్డి-సుప్రియ సంసారంలో గురువారం రాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 11.30 గంటల సమయంలో సుప్రియ ఉరేసుకున్నట్లు పక్కింటి వారు ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఆ సమయంలో రాఘవేందర్‌రెడ్డి విధులకు వెళ్లాడు. తమ కుమార్తె రాత్రి 8 గంటల సమయంలో తమతో మాట్లాడిందని, ఆమె మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని సుప్రియరెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండగకు ఊరెళ్తూ.. ట్రావెల్ బస్సును ఢీకొని ఒకరి మృతి

కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని విలియంకొండ తండా స్టేజీ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వనపర్తి మండలం మెంటెపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(38) మృతి చెందారని ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ప్రమాదంలో అతని స్నేహితుడు ఖాజమైనోద్దీన్ తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ఉపాధి కోసం కొత్తకోటలో ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి దసరా పండగ కోసం శుక్రవారం రాత్రి స్నేహితుడితో కలిసి సొంత గ్రామం వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో దంపతుల మృత్యువాత

పండగ పూట విషాదం



బక్కన్న, నారమ్మ

రేవల్లి (గోపాల్‌పేట), న్యూస్‌టుడే : వనపర్తి జిల్లా రేవల్లి మండలం కొత్తబండరావిపాకుల గ్రామానికి చెందిన భార్యాభర్తలు బక్కన్న(55), నారమ్మ(50) శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. గ్రామస్థుల కథనం మేరకు దంపతులిద్దరు సాయంత్రం గ్రామానికి సమీపంలోని శానాయిపల్లి గుట్టలపైకి సీతాఫలాలు తెంచుకురావడానికి వెళ్లారు. కాయలు తెంచుకుని వస్తుండగా గుట్టకు సమీపంలో శానాయిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన వేరుసెనగ పైరును అడవి జంతువుల నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచెను తగలడంతో విద్యుదాఘాతంతో భార్యాభర్తలిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. చీకటి పడినా తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో కుమారుడు శ్రీరాములు టార్చిలైటు తీసుకుని గుట్టలవైపు వెళ్లారు. ఓ చోట వారు విగతజీవులై పడి ఉండటాన్ని గుర్తించి రోదిస్తూ గ్రామంలోకి వచ్చి మాజీ సర్పంచి బాలస్వామికి విషయం తెలిపారు. ఆయన, మరికొందరు వెళ్లారు. మృతదేహాల వద్దకు చేరుకున్న సమయంలో వారివెంట వెళ్లిన ఒక కుక్క వారి కళ్లముందే విద్యుత్తు కంచెకు తగిలి ప్రాణాలు కోల్పోయింది. వెంటనే పొలం యజమానిని పిలిపించడంతో ఆయన విద్యుత్తు సరఫరాను తొలగించారు.

ముంపులో భూమి కోల్పోయి..: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల జలాశయంలో బండరావిపాకుల గ్రామం ముంపునకు గురైంది. బక్కన్నకు చెందిన వ్యవసాయ భూమి ముంపులో పోయింది. ఇటీవల కొత్త బండరావిపాకులలో ఇల్లు నిర్మించుని కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. భూమి కోల్పోవడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో సీతాఫలాలు తెంపి అమ్ముకోవడానికి దంపతులిద్దరు వెళ్లి మృత్యువాత పడ్డారు. పండగపూట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైలు ఢీకొని వివాహిత దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వివాహిత దుర్మరణం పాలైన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం జమిస్తాపూర్‌కు చెందిన భాగ్యలక్ష్మి (28) కుటుంబం కొంత కాలంగా కలెక్టర్ బంగ్లా ఫ్లైఓవర్ సమీపంలో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన భాగ్యలక్ష్మి రైలు ఢీకొని మృతి చెందింది. ఈ మేరకు భర్త ఆంజనేయులు గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడు..

బాలానగర్, న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మొదంపల్లి గ్రామానికి చెందిన స్వామి (25) మండల కేంద్రంలో ఓ కిరాణ దుకాణంలో దసరా పండగ సామగ్రి తీసుకొని ద్విచక్రవాహనంపై వెళ్తూ మార్గమధ్యలో పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న మండలంలోని చింతకుంటతండాకు చెందిన టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిప్పర్‌ను ఠాణాను తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో... రవి : దేవర
రమణ : వేట్టయన్ దహంటర్. రామకృష్ణ : విశ్వం. కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర
అశోక్ : వేట్టయన్ దహంటర్

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 78, వంకాయ 45, బెండ 45, మిరప 48, కాకర 64, బీర 64, క్యాలీఫ్లవర్ 74, క్యాబేజీ 42, క్యారెట్ 64, దొండ 48, ఆలుగడ్డ 44, గోకర 64, దోస 44, ఆనంకాయ 18, చిక్కుడు 64, మునగకాయ 78, బీట్‌రూట్ 50, ఖీర, 45, బీన్స్ 90.

నియంత్రికల మరమ్మతుకు అవస్థలు

దూరం ఎక్కువుండంతో రైతుల తిప్పలు



అచ్చంపేటలో నియంత్రికల మరమ్మతు కేంద్రం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : ఉరుములు, మెరుపులతో పాటు అధిక విద్యుత్తు వినియోగానికి తరచూ నియంత్రికలు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వీటిని మరమ్మతు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా దూరం సమస్య వీరిని వెంటాడుతోంది. అచ్చంపేట నుంచి అమ్రాబాద్ మండలం ఈగలపెంట 60 కిలోమీటర్లుండగా, పదర మండలం మద్దిమడుగు 80కి.మీ దూరంలో ఉంది. ఇక్కడి రైతులు అచ్చంపేటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వకుర్తి నుంచి చారగొండ మండలం మర్రిపల్లి 30కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ కూడా దూరం సమస్య తప్పడంలేదు. అయితే నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 2, కల్వకుర్తిలో 2, అచ్చంపేటలో 1, కొల్లాపూర్‌లో 1 మరమ్మతు కేంద్రాలున్నాయి.

బోర్ల వినియోగంతో.. : ఈ ఏడాది భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు సైతం పెరిగాయి. దీంతో వేరుశనగతో పాటు వివిధ రకాల పంటల సాగు ఊపందుకుంది. వీటికి బోర్ల ద్వారా నీరందిస్తున్నారు. అమ్రాబాద్, పదర, అచ్చంపేట మండలాల్లో అధికంగా బోర్ల వినియోగం ఉంది. దీంతో నిత్యం నియంత్రికలు కాలిపోతున్నాయి.

రోజూ 8 నుంచి 12... : గతనెల రోజుల నుంచి విద్యుత్తు వినియోగం భారీగా పెరగడంతో సెప్టెంబరులోనే 135 నియంత్రికలకు మరమ్మతు చేశారు. ఈనెల ప్రారంభం నుంచి రోజుకు 8 నుంచి 12 నియంత్రికలు మరమ్మతు కేంద్రానికి వస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. అయితే మరమ్మతులు చేసిన నెలలోపే మళ్లీ పాడైతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని ట్రాక్టర్‌లో కేంద్రానికి తీసుకువస్తే నిర్వాహకులు అద్దె కూడా చెల్లించడంలేదని వాపోతున్నారు. నియంత్రిక మంజూరైతే డీడీలు, ఆర్ఓఆర్ తదితర దస్త్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలంటూ కొర్రీలు పెడుతున్నారని, ఒకవేళ అందజేసినా వాటి డబ్బులు వచ్చే వరకు నెలల సమయం పడుతుందని బల్మూర్, అమ్రాబాద్, పదర మండలాల రైతులు చెబుతున్నారు.

జిల్లాలోని ఏర్పాటు చేసిన నియంత్రికల వివరాలు ఇలా...

మండలం	నియంత్రికలు	మరమ్మతు కేంద్రం	సెప్టెంబరులో చేసిన మరమ్మతులు
అచ్చంపేట	2408	అచ్చంపేట	113
అమ్రాబాద్	817	కల్వకుర్తి (2)	139
బల్మూర్	1561	కొల్లాపూర్	70
లింగాల	1409	నాగర్‌కర్నూల్ (2)	120 (సుమారుగా)
ఉప్పునుంతల	2100		
కోడేర్	1854		
కొల్లాపూర్	1585		
పెద్దకొత్తపల్లి	2062		
బిజినేపల్లి	2426		
నాగర్‌కర్నూల్	1907		
తాడూర్	1762		
తెల్కపల్లి	1800		
తిమ్మాజిపేట	1567		
వెల్దండ	2601		
వంగూరు	2420		
కల్వకుర్తి	3384		
ఉర్కొండ	1639		
పెంట్లవెల్లి	541		
పదర	720		
చారగొండ	1351		

ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారు..

అమ్రాబాద్ (పదర) మండల కేంద్రంలో నియంత్రికల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపించారు. త్రీ ఫేస్ నియంత్రికలు (100 కె.వి.6, 63 కె.వి. 4, 25 కె.వి.10, 16 కె.వి.16), సింగిల్ ఫేస్ నియంత్రికల (25 కె.వి.3, 15 కె.వి.3, 10 కె.వి.3)ను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతుల వివరాలు సేకరించి ట్రాక్టర్ల అద్దె చెల్లిస్తారు. - ఏఈ సత్యనారాయణమూర్తి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్‌పార్టీ ప్రధాన లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో రాయితీపై గ్యాస్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజాపాలన సాగుతోందన్నారు. పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం, కమిషనర్ మహమూద్ షేక్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో 107.06 మి.మీ వర్షం

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కొల్లాపూర్ నియోజకవర్గంలో 107.06 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో నరేందర్ శుక్రవారం తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలంలో 43.2 మి.మీ, కోడేరులో 29.4 మి.మీ, కొల్లాపూర్‌లో 20.0 మి.మీ, పెంట్లవెల్లి మండలంలో 15.0 మి.మీ నమోదైందన్నారు.

సగరుల అభివృద్ధికి కృషి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : సగరులు ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.రాజేశ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సగర సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన గట్టు శ్రీనివాసులుతో పాటు కార్యవర్గాన్ని సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, కోశాధికారి బాలయ్య, అల్లం రాములు, జానకిరాములు, కొమ్ముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శేఖర్



వంగూరు, న్యూస్‌టుడే : వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొండారెడ్డిపల్లికి చెందిన శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఎన్నిక జరిగినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీసాల గోపి తెలిపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఈనెల 17న వాల్మీకి జయంతి సందర్భంగా సీఎంకు వినతిపత్రం ఇస్తామన్నారు.

ట్యాంకుబండ్‌పై వాహనాలకు అనుమతి నిరాకరణ

కందనూలు, న్యూస్‌టుడే : దసరా పండుగ సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై వాహనాలకు అనుమతి లేదని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ నుంచి తాడూరు, కల్వకుర్తి వెళ్లే వాహనచోదకులు మంతటి చౌరస్తా నుంచి వెళ్లాలన్నారు. ప్రజలు, వాహనచోదకులు ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తికి సమీకృత గురుకులం ఏదీ?

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: కల్వకుర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డితో పాటు తను కూడా ఎమ్మెల్యేనని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి ప్రాంతానికి సమీకృత గురుకులం ఎందుకు మంజూరు చేయలేదని మాజీ ఎమ్మెల్యే, భారాస నేత జైపాల్‌యాదవ్ ప్రశ్నించారు. శుక్రవారం వెల్దండలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తికి సమీకృత గురుకులం తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ 300రోజుల పరిపాలనలో రూ.80వేల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. హైడ్రా పేరుతో బీదలకు కడుపుకోత మిగిలిస్తున్న కాంగ్రెసోళ్లకు పేదల ఉసురు తగులుతుందన్నారు. కొట్ర గ్రామంలో దుర్గామాతకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. భారాస నాయకులు మధుసూదన్‌రెడ్డి, శేఖర్, నిరంజన్, ఆనంద్, జోగురవి, శ్రీను, రాజు, మల్లేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



కుంట కాదు.. రహదారే

కోడేరు - నాగులపల్లి ప్రధాన రహదారిపై గుంతలో నిలిచిన నీటి చిత్రమిదీ. 2023లో ఈ రెండు గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల మేర బీటీ నిర్మాణం కోసం దాదాపు రూ.6కోట్లు మంజూరు చేశారు. నాగులపల్లి నుంచి దొడ్డిగుట్ట సమీపం వరకు పనులు చేసి, కిలోమీటర్ మేర కంకర, మట్టి పరిచి వదిలేశారు. వర్షపు నీటితో పాటు కేఎల్ఐ కాల్వ నీళ్ల జాలువారి ఇలా ఈ దారిపైకి వచ్చి చేరుతోంది. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' గురువారం క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, కోడేరు

ప్రపంచ స్థాయి విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం : మల్లు రవి



తూడుకుర్తిలో సమీకృత గురుకుల భవనం భూమి పూజ కార్యక్రమంలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే డా.రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ప్రపంచ స్థాయి విద్యను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ మల్లురవి అన్నారు. శుక్రవారం మండలంలోని తూడుకుర్తి గ్రామంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. మల్లురవి మాట్లాడుతూ.. ఈ గురుకులాలకు మొదటి విడతలో రూ.150కోట్లు, రెండో విడతలో రూ.150 కోట్లు మంజూరు అవుతాయన్నారు. 4 నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలు మాట్లాడారు. వైద్య కళాశాల వద్ద త్వరలోనే ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి ఆరు సబ్‌స్టేషన్లు రానున్నాయని అన్నారు. సమావేశంలో డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్, తాడూరు విండో అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, నాయకులు కోటయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అచ్చంపేట న్యూటౌన్, (ఉప్పునుంతల), న్యూస్‌టుడే : ఉప్పునుంతల మండలం రాయిచెడి శివారులో సమీకృత గురుకుల (బాలురు) పాఠశాలల నిర్మాణానికి ఎంపీ డా.మల్లురవి ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమ కట్టడాలను తొలగిస్తుంటే భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రజలను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో ఏకలవ్య, నవోదయ పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అచ్చంపేట వద్ద సీతారాల గుట్టపై మాజీ మంత్రి, స్వర్గీయ పుట్టపాగ మహేంద్రనాథ్ కళాభవన్‌ను నిర్మిస్తామని తెలిపారు. డీఈవో గోవిందరాజులు, గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్, ఉమామహేశ్వర దేవస్థాన ఛైర్మన్ మాధవరెడ్డి, ఆర్డీవో మాధవి, నేతలు నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, సీఎంరెడ్డి పాల్గొన్నారు.

సీఎం గ్రామంలో ఏర్పాట్ల పరిశీలన



అధికారులు, పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఎం భద్రతాధికారి, అడిషనల్ ఎస్పీ లక్ష్మీకాంతరావు చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

వంగూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దసరా పండగకు స్వగ్రామం కొండారెడ్డిపల్లికి వస్తున్న తరుణంలో అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం భద్రతాధికారి, అడిషనల్ ఎస్పీ లక్ష్మీకాంతరావు, కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సీఎం సోదరుడు కృష్ణారెడ్డితో కలిసి వారు హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి అధికారులు, పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.రమేష్, డీఆర్‌డీవో పీడీ చిన్న ఓబులేశ్, జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం వేంకటేశ్వరుడి కల్యాణం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : కోడుపర్తి ఆలయంలో వేంకటేశ్వరుడి కల్యాణం భక్తుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలోని మూలవిరాట్టుకు అభిషేకాలు, పూజల హోమాలు చేశారు.

నేడు నిత్యాన్న ప్రసాదం నిలిపివేత

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉమామహేశ్వర క్షేత్రంలో నిత్యాన్న ప్రసాదం దసరా పండగ సందర్భంగా 12న నిలిపేస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ మాధవరెడ్డి, కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. 13న నుంచి మళ్లీ కొనసాగుతుందని చెప్పారు.

దుబ్బతండాలో తీరిన నీటి సమస్య

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : దుబ్బతండాలో మిషన్ భగీరథ నీరు మూడు రోజులుగా రాకపోవడంతో పండగ పూట గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలరాజును వివరణ కోరగా... ప్రధాన పైపులైన్ లీకేజీ కావటంతో సరఫరా నిలిచిపోయిందని, శుక్రవారం మరమ్మతు చేసినట్లు సరఫరా చేసినట్లు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సామ రమేష్ తెలిపారు. ఈనెల 27న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక మహాసభకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం అచ్చంపేటలోని పీవీరావు భవనంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నేతలు లింగమయ్య, దివాకర్, బాలస్వామి, అంతయ్య, విష్ణు, నందు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు



ఉర్కొండలో పథసంచలనం చేస్తున్న స్వయం సేవకులు

ఉర్కొండ, న్యూస్‌టుడే: దేశ సమగ్రతే ఆరెస్సెస్ సిద్ధాంతమని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రచారకర్త భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 167 జాతీయ రహదారి మీదుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి మాట్లాడారు. నాయకులు ఆంజనేయులు, రవీందర్, జనార్దన్‌రెడ్డి, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : శుక్రవారం పట్టణంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం నుంచి పుర వీధుల గుండా పథ సంచలన్(ర్యాలీ) నిర్వహించారు.



కల్వకుర్తి పట్టణంలో..

క్రికెట్ పోటీలు ప్రారంభం

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా ప్రీమియర్ లీగ్ సీజన్ 3 పోటీలను శుక్రవారం మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్ ప్రారంభించారు. అలాగే అల్లంతోటబావితండాలో క్రికెట్ పోటీలను కాంగ్రెస్ నాయకులు అరుణ్‌నాయక్ ప్రారంభించారు. నిర్వాహకులు పోలే అశోక్, మధుసూదన్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ : విద్యుద్దీపాల అలంకరణలో ట్యాంకుబండ్

దసరా ఉత్సవాలకు ముస్తాబు

కందనూలు, కల్వకుర్తిపట్టణం, లింగాల, కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండుగ ఉత్సవాలకు పుర అధికారులు పట్టణంలోని ట్యాంక్‌బండ్‌ను ముస్తాబు చేశారు. విద్యుత్తు దీపాలతో ట్యాంక్‌బండ్‌ను అలంకరించారు. బతుకమ్మ ఘాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ట్యాంక్‌బండ్ వద్ద జమ్మి చెట్టుకు పూజలు చేయనున్నారు. కల్వకుర్తి పట్టణంలో దసరా ఉత్సవాలకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించేందుకు పనులు వేగవంతం చేశారు. లింగాలలో శ్రీకోదండరామాలయాన్ని ఆలయ కమిటీ వారు ముస్తాబు చేశారు. కొల్లాపూర్ ప్రాంతంలో శమీవృక్షాల వద్ద ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



కల్వకుర్తి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



తాడూరు: భల్లాన్‌పల్లిలో..



కొల్లాపూర్ : చుక్కాయిపల్లిలో..



అచ్చంపేటలో...



అచ్చంపేటలో...

కరుణించమ్మా.. కల్పవల్లీ



కల్వకుర్తి: పూజల్లో పాల్గొన్న భక్తులు

జిల్లావ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. కల్వకుర్తి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. అచ్చంపేటలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. భ్రమరాంబిక దేవాలయంలో పూజలు నిర్వహించారు. అచ్చంపేటలో రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వాసవీ ఆలయంలో అమ్మ వారికి భక్తులు వస్త్రాలు సమర్పించారు. తెలకపల్లి, లింగాల, తిమ్మాజిపేట, వెల్దండ మండలాల్లో పూజలు నిర్వహించారు. అచ్చంపేట మండలం ఉమామహేశ్వరంలో అమ్మవారిని ఉమాదేవిగా అలంకరించారు. కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో కన్యక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆర్య వైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరిదేల శమీవృక్షం వద్ద, చుక్కాయిపల్లి, కోడేరులోని శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా అలంకరించారు. ఉప్పునుంతలలోని కేదారేశ్వర, చెన్నకేశవ ఆలయంలో కుంకుమార్చన చేశారు.



లింగాలలో బతుకమ్మ ఆటపాటలు

- న్యూస్‌టుడే బృందం

ఉపాధి క్షేత్ర సహాయకుడి మృతి.. రూ.20 వేలు అందజేత.. కోడేరు, న్యూస్‌టుడే : మండలంలోని ఎత్తం ఉపాధి క్షేత్ర సహాయకుడు శ్రీనివాసులు(43) గుండెపోటుతో ఇంట్లో మృతిచెందారు. తక్షణ సాయం కింద ఏపీవో నాగరాజు, ఈసీ సరిత ద్వారా రూ.20 వేలు అందజేసినట్లు ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. భార్య భాగ్యమ్మ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు చోట్ల రేషన్ బియ్యం పట్టివేత.. లింగాల, న్యూస్‌టుడే : మండలంలోని మగ్దూంపూర్ వద్ద 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఆటోను స్వాధీనం చేసుకొని, పడిగె ఉసేన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. డీటీ ఆంగోత్ హేంలానాయక్ పాల్గొన్నారు.

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కుర్మిద్ద గ్రామానికి చెందిన సత్యం ఇంట్లో రేషన్‌బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేయగా 3.5క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విగ్రహం ధ్వంసం.. నిందితుడి అరెస్టు.. అబిడ్స్, న్యూస్‌టుడే: నాంపల్లిలోని ఓ మండపంలో దుర్గామాత విగ్రహం ధ్వంసం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి మధ్యమండలం డీసీపీ అక్షాంష్‌యాదవ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూలుకు చెందిన కృష్ణయ్యగౌడ్ మానసిక స్థితి సరిగ్గా లేదని.. గురువారం రాత్రి మైదానంలో దాండియా చూశాడు. అర్ధరాత్రి పూట మండపంలో మాత విగ్రహం వద్ద తినడానికి ఆహారం దొరుకుతుందని భావించి వెతుకుతుండగా విగ్రహం చేతి విరిగిపోయిందన్నారు. ఆ సమయంలో అక్కడ వాలంటీర్లు లేకపోవడంతో వస్తువులను చిందరవందరగా పారేసి వెళ్లిపోయినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా తెలిసిందన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ ఆనంద్, ఏసీపీ చంద్రశేఖర్, సీఐ విజయ్‌కుమార్ ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

చారకొండ (వెల్దండ గ్రామీణం),న్యూస్‌టుడే: చారకొండ మండలం జూపల్లి గ్రామంలో దసర పండుగ సందర్భంగా గాంధీజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు వెల్దండ ఉమ్మడి మండల సింగిల్‌విండో ఛైర్మన్ భాస్కర్‌రావు, సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ ఛైర్మన్ రాములుయాదవ్ నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్యయాదవ్, మాజీ సర్పంచి సాయికుమార్, సంఘం అధ్యక్షుడు పరంజ్యోతి, నాయకులు సీరాజ్, తిరుపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతలతో నిర్వాహకులు